గడువులోగా రేషన్ సరుకులు చేరవేయాలి

గోదాములో వివరాలు తెలుసుకుంటున్న రఘునందన్

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 11 : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని చౌక ధరల దుకాణాలకు నిర్ణీత గడువు లోగా రేషన్ సరుకులు చేరవేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్ అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నంలోని పౌర సరఫరాల గోదామును తనిఖీ చేశారు. రేషన్ దుకాణాలకు చేరవేస్తున్న సరుకుల వివరాలను పరిశీలించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చేలా సాంకేతికతతో కూడిన జీపీఎస్ వాహనాలను వాడటం జరుగుతుందని తెలిపారు.

పురుగు ఆశించకుండా చర్యలు చేపట్టాలి

చేవెళ్లరూరల్ : మీర్జాగూడ గ్రామంలో పంటను పరిశీలిస్తున్న సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ కే వాణిశ్రీ, ఏడీఏ రమాదేవి, ఏవో తులసి

చేవెళ్ల రూరల్, జనవరి 11 : కుసుమ పంటను తామర పురుగు ఆశించకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం డిస్ట్రిక్ట్ అగ్రికల్చర్ అడ్వైజరీ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ తెలంగాణ సెంటర్ (డీఏఏటీటీసీ) తాండూరు శాస్త్రవేత్త డాక్టర్ టి.లక్ష్మయ్య, మొక్కజొన్న పరిశోధనా కేంద్రం కీటక విభాగం సీనియర్ శాస్త్ర వేత్త డాక్టర్ వాణిశ్రీ అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని ఇబ్రహీంపల్లి, మీర్జాగూడ గ్రామాల్లో గురువారం వారు పర్యటించి కుసుమ, శనగ, కూరగాయల పంటలను పరిశీలించారు. సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటించేలా సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం కుసుమ పంటకు తామర పురుగు ఆశించే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి పంటలు పండిస్తే ఆశించిన మేరకు లాభాలు పొందవచ్చని సూచించారు. శాస్త్రవేత్తల వెంట ఏడీఏ రమాదేవి, మండల వ్యవసాయ అధికారి తులసి, సర్పంచ్ భీమయ్య, మండల వ్యవసాయ విస్తరణ అధికారి బాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు వహించాలి

శంకర్‌పల్లి : పండించిన పంటలకు పురుగు పట్టకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మొక్కజొన్న పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డా.వాణిశ్రీ అన్నారు. మండలంలోని టంగటూర్ గ్రామంలో కుసుమ, జొన్న, మొక్కజొన్న, కూరగాయల పంటలను పరిశీలించారు. రైతులకు సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా.లక్ష్మయ్య, వ్యవసాయ అధికారి సురేశ్‌బాబు, ఏఈవో రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు

కడ్తాల్, జనవరి 11ః మండల పరిధిలోని మక్త మాదారం గ్రామంలో గల వేణుగోపాలస్వామి ఆలయంలో ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో ఆలయ అనువంశిక అర్చక, ధర్మకర్త తిరుమల వింజమూరు రామానుజాచార్యులు, ఆదిత్యాచార్యుల ఆధ్వరంలో తొలిరోజు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, హారతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దేవతామూర్తులను పల్లకిలో ఊరేగించారు. వేణుగోపాలస్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగమంతా మార్మోగింది. అనంతరం తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

మాడల్ స్కూల్ పిలుస్తోంది..

- ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ విడుదల
- ఫిబ్రవరి 22 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష
- ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో బోధన

మొయినాబాద్, జనవరి 11 : పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆంగ్లంలో నాణ్యమైన విద్యను పొందాలి అంటే లక్షల్లో ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ మధ్య తరగతి, పేదరిక కుటుంబాలకు చెందిన విద్యార్థులు లక్షల్లో ఫీజులు చెల్లించని పరిస్థితి ఉంటుంది. తోటి పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో విద్యను అభ్యసిస్తున్నారు అంటే తమ పిల్లలను కూడా చదివించాలని కాయా కష్టం చేసి, అప్పో సప్పో చేసి ఫీజులు అతి కష్టం మీద చెల్లిస్తుంటారు. ఫీజులు కట్టలేని పరిస్థితి ఉండే విద్యార్థులను పరీక్షలు రాయనివ్వకపోవడం స్కూల్ బయట తోటి విద్యార్థుల ముందు నిలబెట్టి అవమానించడం వంటి పరిస్థితి ఉంటుంది. ఇలాంటి పరిస్థితులు మధ్య, పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఇబ్బంది పడకూడదని, వారికి సైతం నాణ్యమైన విద్యను ఆంగ్ల మాధ్యమంలో అందించాలనే ఆలోచనతో ప్రభుత్వం మాడల్ పాఠశాలలను ప్రవేశపెట్టి నాణ్యమైన విద్యను ఆంగ్ల మాధ్యమంలో ఉచితంగా విద్యా బోధన అందిస్తున్నారు. ఆంగ్ల మాధ్యమంలో చదవాలనుకునే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మాడల్ స్కూల్ ఒక వరంగా మారింది. విద్య కోసం రూ. లక్షల్లో ఖర్చు పెట్టి దూర ప్రాంతాల్లో ప్రైవేట్ పాఠశాలల్లో చదవాల్సి లేకుండా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోనే ఆదర్శ పాఠశాలలను నెలకొల్పడంతో నాణ్యమైన విద్య అందుతున్నది. బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తూ 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 12 నుంచి ఫిబ్రవరి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. 6వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7న ఆయా పాఠశాలల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుందని పాఠశాల విద్యా శాఖ అధికారులు వెల్లడించారు. 7,8,9,10 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రూ.125, ఇతరులు రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు http://telanganams.cgg.gov.in వెబ్ సైట్‌లో చూడవచ్చు

ఒక్కో పాఠశాలలో 100 సీట్ల చొప్పున..

చేవెళ్ల నియోజకవర్గంలో 5 మండలాలు ఉండగా అందులో మొయినాబాద్ మినహాయించి చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, నవాబ్‌పేట మండలాల్లో ఆదర్శ (మాడల్ స్కూల్) పాఠశాలలు ఉన్నాయి. ఆదర్శ పాఠశాలలు ఆయా మండలాల్లో విజయవంతంగా కొనసాగుతున్నాయి. మాడల్ పాఠశాలల్లో సీట్లు పొందడానికి తీవ్ర పోటీ నెలకొన్నది. ఎందుకంటే ఉచితంగా ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యా బోధన అందుతుంది కాబట్టి పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలను అందులో చేర్పించడానికి ఎంతో ఆసక్తి చూపుతున్నారు. 6వ తరగతిలో 100 సీట్లు పొందే అవకాశం ప్రభుత్వం కల్పించింది. 7, 8, 9, 10 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి విద్యా శాఖ ప్రణాళికలను రూపొందించింది.

ఏప్రిల్ 1 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్

మాడల్ స్కూల్‌లో 6, 7, 8, 9, 10 తరగతుల్లో ప్రవేశాలు పొందడానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఏప్రిల్ 1 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి. పరీక్షా ఫలితాల ప్రకటన తరువాత సంబంధిత పాఠశాల ప్రిన్సిపాల్స్‌కు మెరిట్ జాబితా అందుతుంది. మాడల్ స్కూల్‌లో విద్యార్థుల ఎంపిక ఖరారు చేస్తారు. దానికి అడిషనల్ కలెక్టర్లు ఆమోదం తెలుపుతారు. మే 25 నుంచి 31వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టి ప్రవేశాలు కల్పిస్తారు. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి.

పరీక్షా విధానం..

6వ తరగతి ప్రవేశ పరీక్షల్లో 100 ప్రశ్నలతో ప్రశ్నా పత్రం తయారు చేసి 100 మార్కులు కేటాయించారు. ప్రశ్నా పత్రం తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఉంటుంది. 6వ తరగతిలో తెలుగు, గణితం, ఎన్విరాన్‌మెంటల్, సైన్స్, ఆంగ్ల పాఠ్యాంశాల్లో ఒక్కో దాని నుంచి 25 ప్రశ్నలు ఉంటాయి. 7 నుంచి 10 వరకు గణిత, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం, ఇంగ్లిష్ నుంచి 100 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో దాని నుంచి 25 ప్రశ్నలు వస్తాయి. 2 గంటల పాటు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు.

బాలికలకు హాస్టల్ వసతి

బాలికలకు హాస్టల్లో వసతి, సౌకర్యం ఉంటుంది. 9, 10, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న 100 మందికి మాత్రమే అవకాశం కల్పించడం జరుగుతుంది. పాఠశాల, హాస్టల్‌కు 3 కిలో మీటర్ల దూరంలో ఉండే విద్యార్థులకు మాత్రమే హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుంది.

త్రిపుల్ ఐటీ సీటు సాధించిన మాడల్ విద్యార్థిని

శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామానికి చెందిన ఎర్ర నవ్య అనే విద్యార్థిని శంకర్ పల్లి మండల కేంద్రంలో ఉన్న మాడల్ పాఠశాలలో 10వ తరగతి వరకు చదివింది. పాఠశాలలో చదువుతుండగా బాసరలోని త్రిపుల్ ఐటీ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ఫలితం సాధించి ఇంటర్ కళాశాలలో సీటు పొందింది. ఇంటర్ విద్యతోపాటు త్రిపుల్ ఐటీ కోచింగ్ పొందుతున్నది.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విద్యార్థులు మాడల్ పాఠశాలల్లో వచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఎందుకంటే మాడల్ పాఠశాలల్లో ఉచితంగా ఆంగ్లంలో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుంది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఈ పాఠశాలల్లో విద్యా బోధన ఉంటుంది. మాడల్ విద్యార్థులు ఐఐటీలో సీట్లు కూడా పొందుతున్నారు. విద్యార్థినులకు ఉచితంగా హాస్టల్ వసతి సౌకర్యం కూడా ఉంది. కావున విద్యార్థులు, విద్యార్థినులు మాడల్ పాఠశాలల ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. – కె వెంకటయ్య, ఎంఈవో

పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలు

కడ్తాల్, జనవరి 11 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను విద్యార్థినులకు ఉపాధ్యాయులు వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిబట్ల : ఆదిబట్లలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు సంక్రాంతి సంబురాలను జరుపుకొన్నారు. పాఠశాల ఆవరణలో బోగి మంటలు వేశారు. విద్యార్థినులు ముగ్గులు వేశారు. ఉపాధ్యాయులు కోడి పుంజులతో కాసేపు సరదాగా పందెం నిర్వహించి విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం పరమేశ్ మాట్లాడుతూ.. తెలంగాణ పండుగులకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుందన్నారు. సంక్రాంతి పండుగను మూడు రోజుల పాటు ఎంతో ఉత్సాహంగా జరుపుకొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు బాబ్లీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్ దోహదం

సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న ఆర్డీవో సాయిరాం, ఎంఈవో

చేవెళ్లటౌన్, జనవరి 11: ప్రతిభను వెలికితీసేందుకే సైన్స్ ఫెయిర్ ఎంతో ఉపయోగపడుతుందని చేవెళ్ల ఆర్డీవో సాయిరాం, ఎంఈవో అక్బర్, వెల్స్పన్ డైరెక్టర్ జ్యోతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తెలంగాణ స్టేట్ మాడల్ స్కూల్, కళాశాలలో వెల్స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన నమునాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు కష్ట పడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శైలజ, మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తేనావతి, వెల్స్పన్ కంపెనీ ఉపాధ్యక్షుడు కృష్ణరాజు, ఎంపీటీసీ వసంతం, వెల్స్పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేపు గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం

కడ్తాల్, జనవరి 11 : మండల కేంద్రంలోని లక్ష్మీచెన్న కేశవస్వామి ఆలయంలో ప్రతి ఏటా ధనుర్మాసంలో నిర్వహించే గోదాదేవి, రంగనాయకులస్వామి వారి కల్యాణోత్సవానికి ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. గ్రామ ప్రధాన పురోహితుడు వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో శనివారం ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, హారతి, విశేష పూజలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

షాద్‌నగర్‌రూరల్, జనవరి11: చికాగో మెడికల్ యూనివర్సిటీ రిసెర్స్, నైస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్ మండలంలోని రాయికల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం యోగా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలుష్యం, కల్తీ ఆహారాన్ని తీసుకోవడంతో చిన్నతనం నుంచే వివిధ రోగాలు వ్యాపిస్తున్నాయని తెలిపారు. అనునిత్యం యోగా చేస్తే ఎలాంటి రుగ్మతలు రావన్నారు. విద్యార్థి దశ నుంచే యోగాలో ప్రావీణ్యం పొందాలన్నారు. విద్యార్థులు యోగా చేస్తే జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జయమ్మ, వ్యాయామ ఉపాధ్యాయుడు గోపాల్, విదేశీ మెడికల్ విద్యార్థులు వెన్లీ, వెంకట్ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేసిన పోలీసులు

శంకర్‌పల్లి, జనవరి 11 : ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీసులు, గుంతలు పడ్డ రోడ్లకు మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో శంకర్‌పల్లి నుంచి చేవెళ్ల వెళ్లే రహదారి నిత్యం గుంతలతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. నిత్యం వేల సంఖ్యలో ఆ రోడ్డు గుండా వాహనాలు తిరుగుతుంటాయి. ఆర్‌అండ్‌బీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు పడుతున్న ఇబ్బందులు చూడలేక చేవెళ్ల ట్రాఫిక్ సీఐ సైదులు ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు నరేశ్, రామచందర్ స్థానికుల సాయంతో గుంతలను పూడ్చివేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 11 : రానున్న పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని రాయపోల్, నాగన్‌పల్లి, పోల్కంపల్లి, దండుమైలారం, ఇబ్రహీంపట్నం బాలికలు, బాలుర ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఎంఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీమెటీరియల్‌ను ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో ఎంఎన్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు టేకుల కమలాకర్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రాయపోల్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నిరంజన్‌రెడ్డి తదితరులు

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి

షాబాద్, జనవరి 11: అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి సభ్యులు సమయానికి రాకపోవడంతో కోరంలేక ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం మధ్యాహ్నం 12:30గంటలకు ప్రారంభమైంది. ముందుగా వ్యవసాయశాఖ నుంచి అధికారులు తమ శాఖకు సంబంధించిన ఎజెండాలు చదివారు. మొత్తం 15 మంది ఎంపీటీసీలకు గాను ఏడుగురు హాజరుకాగా, 41 మంది సర్పంచ్‌లకు 25 మంది కూడా హాజరుకాలేదు. దీంతో అంతంత మాత్రంగానే సమావేశం కొనసాగింది. కొన్ని శాఖల డివిజనల్ స్థాయి అధికారులు సమావేశానికి డుమ్మా కొట్టారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు ఇప్పటికీ విడుదల చేయలేదని, దీంతో అప్పులు తెచ్చి ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎలక్షన్ కోడ్ రావడంతో కొంత ఇబ్బంది జరిగిన విషయం వాస్తవమేనని, చేసిన అభివృద్ధి పనులకు తప్పనిసరిగా బిల్లులు వచ్చేలా చర్యలు చేపడుతామని అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీపీ ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో అనురాధ, వైస్ ఎంపీపీ జడల లక్ష్మీరాజేందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మధు, మండల వ్యవసాయాధికారి వెంకటేశం, ఎంఈవో శంకర్‌రాథోడ్, డీఈఈలు విజయ్‌కుమార్, ఇర్ఫాన్, ఏఈలు నరేందర్, శ్రీదివ్య, శారద, సురేశ్, హార్టికల్చర్ డివిజన్ అధికారి అశోక్‌యాదవ్, డాక్టర్లు స్రవంతి, వరలక్ష్మి, శ్రీనివాస్, వార్డెన్‌లు శంకర్, జ్యోతి, స్వప్న, ఏపీవో వీరాసింగ్, ఏపీఎం నర్సింహులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ రాక

చేవెళ్లటౌన్, జనవరి 11: చేవెళ్లలో వివేకానంద విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి శుక్రవారం అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ హాజరుకానున్నట్లు చేవెళ్ల గ్రామ సర్పంచ్ బండారి శైలజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివేకానంద జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఉదయం 10 గంటలకు వివేకానందుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య కూడా హాజరవుతారని తెలిపారు.

పథకాలపై అవగాహన

పెద్దఅంబర్‌పేట, జనవరి 11: అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో భారత్ వికసిత్‌యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల గురించి గురువారం అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

మంచాల, జనవరి 11: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి, ప్రారంభోత్సవాల కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శుక్రవారం హాజరు కానున్నట్లు ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి గురువారం తెలిపారు. మండలంలోని చీదేడు, బోడకొండ, చెన్నారెడ్డిగూడ, మంచాల, ఆరుట్ల గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించి..,అనంతరం మంచాల తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.

15న పీఎం వర్చువల్ సమావేశం

ఇబ్రహీంపట్నం, జనవరి 11 : పీఎం జన్‌మన్‌లో భాగంగా ఈ నెల 15న ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా చెంచులతో ఏర్పాటు చేయనున్న సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రధానమంత్రి నిర్వహించే సమావేశపు ఏర్పాట్లు, జన్‌మన్ పథకం అమలుపై గురువారం సమీకృత జిల్లా కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మారుమూల ప్రాంతాల్లోని గిరిజనుల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకాన్ని ప్రవేశపెట్టిందని, ఇందులో భాగంగా ఈ నెల 15న ప్రధాన మంత్రి వంద మంది చెంచులతో వర్చువల్‌గా నిర్వహించే సమావేశానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. ఆధార్ కార్డు నమోదు ప్రక్రియ, రెసిడెన్షియల్ ధ్రువపత్రాల జారీ, కిసాన్ క్రెడిట్‌కార్డులు, జన్‌మన్ బ్యాంక్ అకౌంట్, ఆయుష్మాన్ భారత్‌కార్డులు, పక్కా ఇళ్ల నిర్మాణం, రహదారుల అభివృద్ధి తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి రామేశ్వరీదేవి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గీతారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

మొక్కలను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ విజయలక్ష్మీ ప్రవీణ్‌కుమార్

శంకర్‌పల్లి జనవరి11 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని రామంతాపూర్ వార్డులో బాల వికాస ఆధ్వర్యంలో ఎఫ్ఐఏ సహకారంతో పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పండ్ల మొక్కలను నాటడం వల్ల ప్రాణి కోటికి ఆహారం లభిస్తుందని తెలిపారు. రైతులు 20 గుంటలలో పండ్ల తోటలు వేస్తే డ్రిప్ ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అశోక్, వాణి ప్రకాశ్‌గుప్తా, రాధ, శ్రీనాథ్, బొడ్డు లావణ్య, సంతోష్‌రాథోడ్, కోఆప్షన్ సభ్యుడు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓబన్న జయంతి

తుర్కయంజాల్,జనవరి 11: స్వాతంత్ర్య పోరాటంలో వడ్డె ఓబన్న పోరాటం వీరోచితమని వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెంకటకృష్ణ, ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ చౌరస్తాలో వడ్డె ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న సంఘం నాయకులు

టీపీయూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం, జనవరి 11 : టీపీయూఎస్ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఇబ్రహీంపట్నం ఎంఈవో వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఇబ్రహీంపట్నం మండలం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, సభ్యులుగా చెన్నారెడ్డి, గోవర్ధన్, శైలజ, స్వప్న, గోవర్ధన్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పూజా పరమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, రాందాస్, భాస్కర్‌రెడ్డి, నర్సింహ, లలిత, సురేశ్, రవీందర్, సంపత్ తదితరులున్నారు.